గజ్వేల్‌లో నియోజకవర్గస్థాయి కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి తదితరులు

త్వరలోనే కాంగ్రెస్ గల్లంతు

లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమే

ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కే పట్టం కడతారు

నాడు కేటీఆర్ దావోస్ పర్యటన దండగన్నారు

- నేడు సీఎం రేవంత్ దావోస్ ఎందుకు వెళ్లారు?
- నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలోనే భట్టి అబద్ధాలు
- బీజేపీ నేతలకు దండలేసేందుకు కాంగ్రెస్ పోటీ
- ప్రాజెక్టుల కింద యాసంగి పంటలకు నీళ్లియ్యాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- గజ్వేల్ పట్టణంలో బీఆర్ఎస్ కృతజ్ఞతా సభ

గజ్వేల్, జనవరి 18: రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి అతి త్వరలోనే తలకిందులవుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మూడోంతుల కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోతారని తెలిపారు. ఏడాదిలోనే ప్రజలు బీఆర్ఎస్‌ను గుర్తిస్తారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కృతజ్ఞతా సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయాల్లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే నీళ్లు నింపారని, యాసంగిలో రైతులకు ఆ నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ ద్వారా కొండపాక మండలంలోని చెరువులను నింపి యాసంగి పంటలకు జీవం పోయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో ఎంతో అభివృద్ధి జరిగినా అలాంటిదేం లేదంటూ అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీ అక్కసం ఎల్లగక్కే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పనిచేశారని కొనియాడారు. అభివృద్ధిలో కేసీఆర్ పోటీ పడితే.. కేసులు పెట్టడంలో కాంగ్రెస్ నాయకులు పోటీ పడుతున్నారని విమర్శించారు.

హామీలపై చేతులెత్తేసిన సర్కారు

ప్రభుత్వం ఏర్పాటైన తరువాత డిసెంబర్ 9న రైతులకు రుణమాఫీ చేస్తామని, రూ.2 వేల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామని, ఉచిత కరెంట్ ఇస్తామని, రైతులకు రైతు బంధు రూ.15వేలు చేస్తామని, ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని హామీలిచ్చి కాంగ్రెస్, ఇప్పుడు వాటిని ఎందుకు అమలు చేయడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగులకు భృతి ఇస్తామని కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ చెప్పినప్పటికీ, అలాంటి హామీనే ఇవ్వలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'దేశం మొత్తం అదానీ, అంబానీ చేతుల్లో ఉన్నదని, అదానీ అవినీతి వెనుక ప్రధాని ఉన్నారనీ, ఇద్దరి చేతుల్లో 500 కంపెనీలున్నాయని రాహుల్‌గాంధీ బస్సుయాత్రలో మాట్లాడితే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి వెళ్లి అదానీని అలుముకుంటున్నారు. ప్రగతి భవన్‌లో 250 బెడ్‌రూంలు, స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయని మాట్లాడిన భట్టి విక్రమార్కను అసెంబ్లీలో నిలదీస్తే సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఝూటా మాటలు మాట్లాడే కాంగ్రెస్ నాయకులను ప్రజలు గమనిస్తున్నారు. గతంలో కేటీఆర్ దావోస్ పర్యటనకు వెళితే పెట్టుబడులు తేవడం దండగ అని అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మరిప్పుడు మీ ముఖ్యమంత్రి ఎందుకు పోయారో సమాధానం చెప్పాలి' అని నిలదీశారు.

గురువారం గజ్వేల్‌లో నియోజకవర్గస్థాయి కృతజ్ఞతా సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గల్లంతే

బీజేపీతో కొట్లాడుతామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఎవరితో కొట్లాడారో చెప్పాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. బండి సంజయ్, అరవింద్, బాబురావు, ఈటల రాజేందర్, రఘునందన్‌రావును ఓడించింది బీఆర్ఎస్సేనని స్పష్టంచేశారు. 'పాలమూరు ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చేది లేదన్న బీజేపీపై కాంగ్రెస్ ఎందుకు కొట్లాడటంలేదు? మెడలు వంచుతామని చెప్పిన కాంగ్రెస్‌వాళ్లు, నేడు బీజేపీ కేంద్ర మంత్రుల మెడలో పూలదండలు వేయటానికి పోటీ పడుతున్నారు. గజ్వేల్ అభివృద్ధి కోసం కేసీఆర్ తెచ్చిన నిధులను వెనక్కి తీసుకోవడం కాదు.. చేతనైతే మరిన్ని నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి' అని కోరారు. 15 రోజుల్లో కేసీఆర్ ఆరోగ్యం కుదుటపడుతుందని, ఆయన త్వరలోనే గజ్వేల్ వస్తారని చెప్పారు. గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించేందుకు రెండు జాతీయపార్టీలు కుట్రలు పన్నాయని విమర్శించారు. కులమతాల పేరుతో చిచ్చు పెట్టే ప్రయత్నం చేశాయని ఆరోపించారు. అయినా కేసీఆర్‌కు 45 వేల అద్భుతమైన మెజార్టీని ఇచ్చి గెలిపించుకున్నారని గజ్వేల్ ఓటర్లను ప్రశంసించారు. కేసీఆర్ వచ్చాక సాగు, తాగునీటి కష్టాలు తీరాయని.. కేసులు, కుట్రలు తగ్గాయని చెప్పారు. గజ్వేల్‌లో కేసీఆర్ మంజూరు చేసిన అభివృద్ధి పనులను ఆపితే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అరుదైన రికార్డు

- ఒక్క డిసెంబర్ నెలలోనే 22.51 లక్షల ప్రయాణికుల రద్దీ
- దేశంలోని విమానాశ్రయాల్లో రెండో స్థానం: జీఎమ్మార్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల రద్దీలో అరుదైన రికార్డును సాధించింది. ఇటీవల ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి దేశీయ, అంతర్జాతీయ టెర్మినళ్ల నుంచి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండగా, ఒక్క డిసెంబర్ నెలలోనే 22.51 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించడం విశేషం. ఇది దేశంలోని మిగతా అంతర్జాతీయ విమానాశ్రయాలతో పోల్చితే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రెండోస్థానంలో నిలిచిందని జీఎమ్మార్ సంస్థ ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1.8 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించినట్టు పేర్కొన్నది. వేగంగా వృద్ధి సాధిస్తున్న ఎయిర్‌పోర్ట్‌గానూ ఇది రికార్డు సాధించింది. ఒక్క ఏడాదిలోనే ఈ విమానాశ్రయం నుంచి 2.10 కోట్ల మంది ప్రయాణం సాగించారు. డిసెంబర్‌లో క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలు, సెలవులు కలిసి రావడంతో అనేక మంది ప్రయాణం చేసినట్టు జీఎమ్మార్ అధికారులు చెబుతున్నారు.

ఎఫ్ఎస్ఎస్ఎం ప్రాజెక్టుల నిర్వహణ భేష్

- కొనియాడిన జపాన్ ప్రతినిధుల బృందం

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : మల వ్యర్థాల నిర్వహణపై అధ్యయనంలో భాగంగా జపాన్‌కు చెందిన ఎనిమిది మంది సభ్యుల ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్‌లోని మున్సిపల్ నాలెడ్జ్ సెంటర్‌ను సందర్శించింది. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో సమావేశమైంది. రాష్ట్రంలో అమలుచేస్తున్న ఎఫ్ఎస్ఎస్ఎం(ఫీకల్ స్లడ్జ్ అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్) ప్రాజెక్టులను బృందం సభ్యులు కొనియాడారు. ఈ సందర్భంగాజపాన్‌లో అమలుచేస్తున్న వ్యర్థ జలాల నిర్వహణ వ్యవస్థను వారు అధికారులకు వివరించారు. అనంతరం సీడీఎంఏ కార్యాలయాన్ని సందర్శించారు. రాష్ట్రంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, మల వ్యర్థాల శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు, వివిధ కార్యక్రమాల గురించి అధికారులు జపాన్ బృందానికి వివరించారు. ఎఫ్ఎస్ఎస్ఎం కింద రాష్ట్రంలో చేపడుతున్న కార్యక్రమాలను తమ దేశంలో కూడా అమలుచేసేందుకు కృషిచేస్తామని జపాన్ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. జపాన్ బృందంలో ఆ దేశ పట్టణాభివృద్ధి శాఖకు చెందిన ప్రముఖులు, ఇంజినీర్లు, పరిశోధకులు ఉన్నారు.

నిరుపేదకు సర్పంచ్ చేయూత

సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా 20 ఏండ్లుగా పనిచేస్తున్న పసుల కనుకయ్య సొంతింటి కలను ఆ గ్రామ సర్పంచ్ నెరవేర్చారు. పూరి గుడిసెలో ఒంటరిగా నివసిస్తుండగా, భారీ వర్షాలకు కూలిపోయింది. బీఆర్ఎస్ నేత, సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్ సొంతంగా రూ.లక్ష వెచ్చించి రేకులతో ఇంటిని నిర్మించారు. గురువారం అతనితో గృహప్రవేశం చేయించి గ్రామస్థుల సమక్షంలో భోజనాలు పెట్టించారు. సర్పంచ్‌ను గ్రామస్థులు అభినందించారు. - ఇల్లంతకుంట

వర్సిటీ రక్షణ సమిష్టి బాధ్యత

- జీవో 55ను ఉపసంహరించుకోవాలి
- భవిష్యత్తుతరాలకు నష్టం కలిగించొద్దు
- పదోరోజు నిరసనలో ఎలుగెత్తిన వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు

పదోరోజు నిరసనలో పాల్గొన్న వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 18: వ్యవసాయ యూనివర్సిటీ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు పేర్కొన్నారు. వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దంటూ వారు చేపట్టిన నిరసన గురువారం పదో రోజుకు చేరుకుంది. వర్సిటీ ప్రధాన గేటు వద్ద బైఠాయించి భూములను కాపాడాలని నినాదాలు చేశారు. రాజేంద్రనగర్‌తోపాటు పాలెం, వరంగల్, సిరిసిల్ల, అశ్వారావుపేట, జగిత్యాల, ఆదిలాబాద్, సంగారెడ్డిలోని వ్యవసాయ కళాశాలల యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు నిరసనలకు దిగారు. యూనివర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మాణం వల్ల భవిష్యత్తు తరాలకు అపార నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నిరసనలకు ప్రజలు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం మనసు మార్చుకుని వర్సిటీ భూములను హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ జారీచేసిన జీవో 55ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శంకర్‌నాయక్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాబాయ్ వర్సెస్ అబ్బాయ్!

- నందమూరి కుటుంబంలో మళ్లీ లొల్లి
- ఎన్టీఆర్‌ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీల తొలగింపు
- బాలయ్య పనేనంటున్న తారక్ ఫ్యాన్స్
- వందమంది బాలయ్యలు, బాబులు వచ్చినా తారక్‌కు ఏమీకాదన్న కొడాలి

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): నందమూరి కుటుంబంలో విభేదాలు మరోమారు బయటపడ్డాయి. బాబాయ్ బాలకృష్ణ, అబ్బాయి జూనియర్ ఎన్టీఆర్ మధ్య గ్యాప్ ఉన్నట్టు వస్తున్న వార్తలు నిజమేనని నిరూపించే ఘటన ఎన్టీఆర్ ఘాట్ వేదికగానే జరిగింది. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద గురువారం తెల్లవారుజామున నందమూరి కుటుంబసభ్యులు నివాళి అర్పించారు. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ కూడా తెల్లవారుజామునే వచ్చి తాతకు నివాళి అర్పించి వెళ్లారు. అప్పటికే అక్కడికి చేరుకున్న తారక్ అభిమానులు ఆయనకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ తర్వాత కాసేపటికే కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో వచ్చిన బాలకృష్ణ తండ్రికి అంజలి ఘటించి వెళ్లారు. అక్కడి వరకు బాగానే ఉన్నా ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. బాలయ్య వెళ్లిపోయిన తర్వాత ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన తారక్ ఫ్లెక్సీలను తొలగించడం వివాదానికి దారితీసింది. బాలకృష్ణ ఆదేశించడంతోనే వాటిని తొలగించారన్న ప్రచారం మొదలు కావడమే కాదు, వాటిని తొలగించాలని బాలయ్య చెప్తున్నట్టుగా ఉన్న వీడియో కూడా బయటకు వచ్చి వైరల్ అయింది. ఇది చూసిన తారక్ అభిమానులు బాలయ్యపై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే కొడాలి నాని గుడివాడలో మాట్లాడుతూ.. వెయ్యిమంది చంద్రబాబులు, బాలకృష్ణలు వచ్చినా తారక్‌ను ఏమీ చేయలేరని తేల్చి చెప్పారు.

నాపై కుట్ర.. నాకు ప్రాణహాని

- నిందితుడినో, బాధితుడినో త్వరలో తేల్తది
- నా హోటల్ అన్యాయంగా కూల్చారు
- డీజీపీ రవిగుప్తాకు నందకుమార్ ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో తనపై కుట్ర జరిగిందని ప్రధాన నిందితుల్లో ఒకరైన నందకుమార్ ఆరోపించారు. ఈ కేసులో తాను నిందితుడినో, బాధితుడినో త్వరలోనే తెలుస్తుందని చెప్పారు. కొందరు తనను హతమార్చేందుకు రెక్కీ నిర్వహిస్తున్నారని, తనకు ప్రాణహాని ఉన్నదని, రక్షణ కల్పించాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లో డీజీపీ రవిగుప్తాకు పలు అంశాలపై ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో తాను జైలులో ఉండగానే తన హోటల్‌ను అన్యాయంగా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాత దగ్గుబాటి సురేశ్‌బాబు, హీరో వెంకటేశ్, రానా, జీహెచ్ఎంసీ అధికారులపై తనకు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో తన ఫోన్లను టాంపరింగ్ చేశారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డీజీపీకి ఫిర్యాదు చేశానని చెప్పారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నదని, ఆ తర్వాత తనపై అనేక కేసులు పెట్టారని తెలిపారు., తనపై పెట్టిన కేసులపై నిష్పక్షపాతంగా విచారణ చేయించాలని డీజీపీని కోరినట్టు ఆయన వెల్లడించారు.

వరంగల్ మహిళకు అరుదైన అవకాశం

జాతీయ వర్క్‌షాప్ ప్యానెలిస్ట్‌గా ప్రత్యేక ప్రాతినిధ్యం

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): వరంగల్ జిల్లా నర్సంపేట మండలానికి చెందిన ఆదర్శ మండల సమాఖ్య ప్రతినిధి మహమ్మద్ నజీమాకు అరుదైన అవకాశం దక్కింది. జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తాధ్వర్యంలో ఢిల్లీలో మండల సమాఖ్యల నిర్వహణపై గురువారం జరిగిన జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో రాష్ట్ర ప్రతినిధిగా ఆమె హాజరై ప్యానెలిస్ట్‌గా ప్రత్యేక ప్రాతినిధ్యం వహించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు 4 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మండల సమాఖ్యల లీడర్లు, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నజీమా మండల సమాఖ్యల పురోగతిపై జరిగిన చర్చలో ప్యానెలిస్ట్‌గా వ్యవహరించారు. తన వ్యక్తిగత జీవితంలో సాధించిన అభివృద్ధి, సంఘం, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల బలోపేతం విధి విధానాలను వివరించి అందరి ప్రశంసలు పొందారు. మహమ్మద్ నజీమా 2007 నుంచి ఉమ్మడి రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో పర్యటించి వేల మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ ద్వారా దేశంలోని 15 రాష్ట్రాల్లో పర్యటించి, మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతో ఆమె ప్రతిభను గుర్తించిన కేంద్రం 2018లోనే జాతీయ స్థాయిలో 'ఉత్తమ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్' అవార్డుతో సత్కరించింది.

'సాఫ్ట్‌వేర్' రైతుకు ప్రధాని ప్రశంస

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. సాగుబాట పట్టిన కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కుమ్మరికుంటకు చెందిన రైతు మల్లికార్జున్‌రెడ్డిని ప్రధాని మోదీ ప్రశంసించారు. వికసిత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గురువారం ప్రధాని వివిధ రాష్ట్రాల్లోని కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వర్చువల్‌గా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు మల్లికార్జున్ కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌ను మోదీ తెలుసుకున్నారు. - చొప్పదండి

సచివాలయ ఉద్యోగుల్లో అయోమయం

- భారీ సంఖ్యలో ఉద్యోగుల మార్పునకు కసరత్తు
- 70 మంది ఆఫీసర్లను మార్చే చాన్స్
- ఆర్థికశాఖలోనే 25 మంది బదిలీ
- సిద్ధమైన జాబితా.. సీఎం అనుమతే తరువాయి
- వర్గాలుగా ఉద్యోగులు.. తెరపైకి కొత్త సంఘాలు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పరిపాలన కేంద్రమైన సచివాలయంలోని ఉద్యోగుల్లో గందరగోళ వాతావరణం కనిపిస్తున్నది. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలన్నర రోజులు గడుస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో పాలన గాడిన పడలేదు. ఈ తరుణంలో భారీ సంఖ్యలో ఉద్యోగులను, అధికారులను ఇతర శాఖలకు బదిలీ చేస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి. కొత్త ఉద్యోగ సంఘాలు కూడా తెరమీదికి వస్తున్నాయి. దీంతో సచివాలయంలో అయోమయం పరిస్థితులు కనిపిస్తున్నాయని ఉద్యోగులు చెప్తున్నారు. గత ప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగారనే అనుమానంతో వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇప్పటికే శాఖలవారీగా జాబితాను సిద్ధం చేసినట్టు తెలిసింది. 60-70 మంది సెక్షన్ ఆఫీసర్లు మొదలు జాయింట్ సెక్రటరీల వరకు స్థానభ్రంశం తప్పదని తెలుస్తున్నది. ఒక్క ఆర్థికశాఖలోనే 20-25 మందిపై బదిలీ వేటు పడుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో బడ్జెట్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన పలువురిని ఈసారి పక్కనబెట్టినట్టు సమాచారం. జీఏడీ, హోం, రెవెన్యూ శాఖల్లోనూ పదుల సంఖ్యలో బదిలీలు ఉంటాయని సమాచారం.

పైరవీలను కూడా పరిగణనలోకి..!

మరికొందరు అధికారులు, ఉద్యోగులు తమకు పలానా శాఖలో, పలానా ప్రాధాన్యమైన పోస్టు ఇవ్వాలని కోరుతూ మంత్రుల చుట్టూ తిరుగుతున్నట్టు తెలుస్తున్నది. ఇందులో తమకు అనుకూలమైన కొందరి విజ్ఞప్తులను పరిశీలనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికే పనిచేస్తున్నవారిని బదిలీ చేసి, వారి స్థానంలోకి కొత్త వారిని తీసుకురానున్నట్టు తెలిసింది. సచివాలయ ఉద్యోగులను బయటికి పంపే అవకాశం లేకపోవడంతో వారిని ఒకశాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేస్తారని చెప్తున్నారు. మొత్తంగా ఇప్పటికే జాబితా సీఎం కార్యాలయానికి చేరిందని, వాటికి సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదముద్ర వేయడమే మిగిలిందని చెప్పుకుంటున్నారు. తాము ప్రభుత్వ ఉద్యోగులమని, ఏ ప్రభుత్వం వచ్చినా విశ్వాసంతో పనిచేయడం తమ విధి అని, అంతమాత్రాన రాజకీయ పార్టీకి అనుకూలమనే ముద్ర వేయడం సరికాదని కొందరు ఉద్యోగులు వాపోతున్నారు.

తెరపైకి కొత్త సంఘాలు.. ఎన్నికలు

సచివాలయ ఉద్యోగుల కోసం 'తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్' (టీఎస్ఏ) గతంలోనే ఏర్పాటైంది. ఇతర సంఘాలు పెద్దగా ఉనికిలో లేకపోవడంతో ఇదే ప్రధాన సంఘంగా కొనసాగింది. నూతన సచివాలయ భవనం ఏర్పాటైన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయ సంఘం పేరుతో కొత్త సంఘం రిజిస్టర్ అయినట్టు చెప్తున్నారు. తాజాగా 'తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్ అసోసియేషన్' (టీఎస్ఎస్ఏ) తెరమీదికి వచ్చింది. తమ సంఘానికి ఎన్నికలు జరిపేందుకు రిటర్నింగ్ ఆఫీసర్‌ను నియమించాలని తాజాగా సీఎస్‌కు లేఖ రాశారు. ఉమ్మడి ఏపీలో సచివాలయ ఉద్యోగులకు 'ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్' (ఏపీఎస్ఏ) ఉండేదని, రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ శాఖ 'టీఎస్ఎస్ఏ'గా ఆవిర్భవించిందని వారు చెప్తున్నారు. వెంటనే తమ సంఘానికి ఎన్నికలు జరిపేందుకు రిటర్నింగ్ ఆఫీసర్‌ను నియమించాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు.

ఒక్కో సంఘం ఒక్కో పార్టీకి ముడిపెట్టి...

మరోవైపు టీఎస్ఏ సైతం ప్రత్యక్ష ఎన్నికలు జరుపుతామని ప్రకటించింది. సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఆఫీస్ బేరర్ల సమావేశం గురువారం జరిగిందని ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్‌మియా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఎస్ఏ నియమనిబంధనలతో సమానంగా టీఎస్ఏ నిబంధనలకు సవరణలు చేసి, ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించినట్టు తెలిపారు. ఇందుకోసం తొమ్మిది మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఇలా సంఘాలు పోటాపోటీగా వస్తుండటంతో ఉద్యోగుల్లో క్రమంగా విభజన కనిపిస్తున్నదని అంటున్నారు. ఒక్కో సంఘాన్ని ఒక్కో రాజకీయ పార్టీకి ముడిపెట్టి చర్చించడం మొదలుపెట్టారని చెప్తున్నారు. ఈ పరిణామాలతో ఉద్యోగుల్లో కాస్త గందరగోళం నెలకొన్నదని, ఇది పని తీరుపై ప్రభావం చూపుతున్నదని పేర్కొంటున్నారు. ఈ వాతావరణాన్ని తొలిగించి పాలనను గాడిలో పెట్టాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

PUB/0062

ఆసక్తి వ్యక్తీకరణ

రైల్వే లబ్ధిదారులకు మెడికల్ ఇన్వెస్టిగేషన్స్ కొరకు నగదురహిత సదుపాయాల ఏర్పాటుకు రైల్వేలతో ఎంప్యానెల్‌మెంట్ కొరకు CGHS/హైదరాబాద్ 2014 రేట్ వద్ద పాథాలజీ మరియు రేడియాలజీతో సహా క్లినికల్ ఇన్వెస్టిగేషన్స్ వంటి సేవల కొరకు అవసరమైన కనీస అర్హతా ప్రమాణాలను నెరవేరుస్తూ మహబూబ్‌నగర్‌లోని ప్రముఖ హాస్పిటల్/ డయాగ్నోస్టిక్ లేబోరేటరీల నుండి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్ వారు ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతున్నారు. అన్ని విధాలుగా పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో 24-01-2024న లేదా ఆలోగా దాఖలు చేయాలి.

కనీస అర్హతా ప్రమాణాలు, దరఖాస్తు ఫారాలు, నియమ నిబంధనలు మొదలగు వాటికి సంబంధించిన వివరాల కొరకు మా వెబ్‌సైట్ www.indianrailways.gov.in దర్శించండి. దరఖాస్తు ఫారాన్ని చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, హైదరాబాద్ భవన్, హైదరాబాద్ డివిజన్, సికింద్రాబాద్ వారి నుండి ఏపని రోజునైనా స్వయంగా పొందవచ్చును.

A0070 చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, హైదరాబాద్

ALLIANCE FOR WATER STEWARDSHIP

పబ్లిక్ స్టేక్‌హోల్డర్ ప్రకటన

V2.0 ఏప్రిల్ 2023

ఐ.టి.సి. పేపర్‌బోర్డ్స్ & స్పెషాలిటీ పేపర్స్ డివిజన్-భద్రాచలం యూనిట్ అలయన్స్ ఫర్ వాటర్ స్టీవార్డ్‌షిప్ స్టాండర్డ్ (AWS) V2.0 ప్రారంభ ధృవీకరణకు దరఖాస్తు చేసుకున్నారు.

సైట్ పేరు:	ఐ.టి.సి భద్రాచలం
సైట్ చిరునామా:	పోస్ట్ బాక్స్-4, భద్రాచలం, సారపాక గ్రామం, బుర్గంపహాడ్ మండలం, భద్రాచలం, తెలంగాణ పిన్-507128, భారతదేశం
GPS సైట్ కోఆర్డినేట్‌లు:	17°41'19"N & 80°52'05"E
సైట్ దేశం:	భారతదేశం
AWS సైట్ రిజిస్ట్రేషన్ నం.	AWS-000454
ఆడిట్ తేదీ:	18/03/2024
ఆడిట్ ఫార్మాట్:	స్థలమునందు
ఆడిట్ స్థాయి:	ప్లాటినం
ఆడిట్ పరిధి:	ఒక సైట్
ఆడిట్ స్థాయి:	ప్రారంభ ధృవీకరణ ఆడిట్

ప్రారంభ ధృవీకరణ ఆడిట్ 18/03/2024 నుండి 21/03/2024 వరకు సైట్ నందు షెడ్యూల్ చేయబడింది. AWS సర్టిఫికేషన్ అవసరాలకు అనుగుణంగా, AWS ఆడిట్‌లో ఉన్న సైట్ పై అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాము. ప్రజలు వారి అభిప్రాయాలను ఆడిట్ తేదీ వరకు ఈ మెయిల్ ద్వారా సమర్పించవచ్చు. ప్రత్యామ్నాయంగా, మీరు ఆడిట్ బృందం